సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 25 । నవంబర్ । 2024



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. - 8లో



రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. - 8లో



విచ్చలవిడిగా బెల్టు దందా!

చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాల దందా జోరుగా సాగిస్తున్నారు. - 9లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

భువనగిరి: 2024–25 సంవత్సరానికి గాను ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 5 కేంద్రాలు ఏర్పాటు చేశారు. భువనగిరి డివిజన్ పరిధిలో 3, చౌటుప్పల్ డివిజన్ పరిధిలో 2 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. ఈపరీక్షకు 971 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 939 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. చౌటుప్పల్‌లోని మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని డీఈఓ సత్యనారాయణ, భువనగిరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారి రఘురాంరెడ్డి పరిశీలించారు. ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు ఒక్కో విద్యార్థికి ఏటా రూ. 12 వేలు అందించనున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే గ్రామీణ క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి

భువనగిరి: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు గ్రామీణ క్రీడలు దోహదపడతాయని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు అన్నారు. ఈశ గ్రామోత్సవంలో భాగంగా ఆదివారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రూరల్ ప్రీమియర్ లీగ్ –2024 సౌత్ ఇండియా లెవెల్ గ్రామీణ క్రీడా ఉత్సవం జరిగింది. మహిళలకు త్రో బాల్, వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ బాలకృష్ణ, ఈశ ఫౌండేషన్ వలంటీర్ పవన్, దివ్య, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

భువనగిరిటౌన్: బస్వాపురం రిజర్వాయర్ బాధితులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ భువనగిరి మండల, పట్టణ సమితిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ.. బస్వాపురం రిజర్వాయర్ లో భూములు కోల్పోయిన బాధితులకు చాలా సంవత్సరాలుగా నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. రిజర్వాయర్ పనుల్లో నాణ్యత లేమి, ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం వంటి వాటిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, మండల కార్యదర్శి మరిపెల్లి రాములు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్పుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, మండల కార్యవర్గ సభ్యులు రాఘవులు, కౌన్సిల్ సభ్యులు అబ్బులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక





శనిగరం పార్థసారథి రాజబోయిన మణి

ఆలేరురూరల్: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఆలేరు ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాజబోయిన మణి, శనిగరం పార్థసారథి ఉమ్మడి జిల్లా 68వ క్రీడల్లో ఎస్‌జీఎఫ్ హాకీ–14 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య తెలిపారు. ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు నరేంద్రస్వామి, పోరెడ్డి రంగయ్య, రావుల సత్యనారాయణ, శ్రీధర్, మల్లేశం, సైదులు, రోహిణి, పరమేష్, శంకర్ అభినందించారు.

వైభవంగా సుదర్శన హోమం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయాన్నే ఆలయాన్ని తీసిన అర్చకులు సుప్రభాతం, ఆరాధన నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం , అర్చన వంటి పూజలు చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం జరిపించారు. అనంతరం గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రికి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి, ద్వార బంధనం చేశారు. కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో యాదగిరిగుట్ట క్షేత్రానికి భక్తులు అధికంగా తరలివచ్చారు.



ఆలయంలోని ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

జాగ్రత్తలతో వ్యాధులు దూరం

భువనగిరిటౌన్: చలికాలంలో జాగ్రత్తలతో ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. కలెక్టర్ హనుమంత రావు ఆదేశాల మేరకు చేపట్టిన ఆరోగ్య శాఖ అధికారుల హాస్టల్ బాటలో భాగంగా శని, ఆదివారం రెండు జిల్లాలోని 89 ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం భువనగిరిలోని ఆయా హాస్టళ్లను డీఎంహెచ్ఓ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదురైన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందాలని, అశ్రద్ధ చేయొద్దని సూచించారు.

చెత్తపై ఏదీ చిత్తశుద్ధి!



రామన్నపేటలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్



వెల్లంకి గ్రామంలో..

అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామ పంచాయతీల్లో తయారుకాని సేంద్రియ ఎరువు
- సేకరించిన చెత్తను తగలబెడుతున్న పారిశుద్ధ్య సిబ్బంది
- రూ.కోట్లల్లో ప్రజాధనం వృథా
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



వెల్లంకిలోని డంపింగ్‌యార్డులో తగలబెడుతున్న చెత్త

రామన్నపేట : ప్రజారోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. ఇంటింటా వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేయాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు. నిధుల లేమి, పారిశుద్ధ్య సిబ్బంది కొరత వల్ల లక్ష్యం చేరుకోవడం ఇబ్బందిగా మారింది. ఫలితంగా లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

రూ.10.52కోట్ల వ్యయంతో నిర్మాణం

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చాలన్న సంకల్పంతో సేకరించిన చెత్తను తరలించేందుకు జిల్లాలోని 421 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. వాటికి అనుబంధంగా ఉపాధిహామీ నిధులు రూ.10.52 కోట్లతో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. ఒక్కో సెగ్రిగేషన్ షెడ్డుకు రూ.2.50 లక్షల చొప్పున ఖర్చు చేశారు. వీటితో పాటు చెత్త సేకరణకు ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఒక ట్రాక్టర్ సమకూర్చారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసేందుకు ఇంటింటికీ రెండు బుట్టలు పంపిణీ చేశారు.

చెత్తను వేరు చేయడం ఇలా..

- ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోని సెగ్రిగేషన్ షెడ్డు వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా ప్లాట్‌ఫారాలపై దింపాలి.
- కంపోస్టు ఎరువు తయారీకి ఉపయోగపడే తడి వ్యర్థాలను సూర్యరశ్మి తగిలేవిధంగా 3,4 రోజులు ఆరబెట్టాలి.
- ఆరబెట్టిన తడిచెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేయాలి. అలా తయారు చేసిన సేంద్రియ ఎరువును నర్సరీల్లో బ్యాగులు నింపడానికి, హరితహారం మొక్కలకు ఎరువుగా వాడాలి. మిగిలిన ఎరువును రైతులకు విక్రయించాలి.
- ఎరువు తయారీకి ఉపయోగపడని పొడిచెత్తలోని కాగితం, గాజు, ఇనుము, ప్లాస్టిక్, పాలిథిన్, లెదర్, బట్టలు వంటి వ్యర్థాలను వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్డులోని కంపార్ట్‌మెంట్లలో వేర్వేరుగా వేయాలి.
- వేరుచేసిన పొడిచెత్త వ్యర్థాలను వేరువేరు బ్యాగుల్లో కట్టలు కట్ట అధీకృత స్క్రాప్‌డీలర్లకు విక్రయించాలి.

పంచాయతీ కార్మికులపై అదనపు భారం

సేకరించిన చెత్తను వేరు చేయడం, ఎరువు తయారు చేయడం, పొడిచెత్తను భద్రపరచి విక్రయించే బాధ్యతలను అప్పటి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అప్పగించింది. కానీ, అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించలేదు. నిధుల కొరత కారణంగా పంచాయతీలు సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు లేకపోయింది. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతుండడంతో సెగ్రిగేషన్ షెడ్లలో పనిచేయడానికి వీలుపడడం లేదు. ఇళ్లనుంచి సేకరించి డంపింగ్ యార్డులకు సేకరించిన చెత్త గుట్టలుగా పేరుకుపోతుండడం, ఎరువు తయారీ నిలిచిపోవడంతో విధిలేక తగలపెడుతున్నారు. ఉపాధిహామీ పథకంలో పనిదినాలు కల్పించి సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలి. రోజూ చెత్తను సేకరించడం వల్ల గ్రామాల్లో చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరనుంది.చెత్తను తగలబెడుతుండడం వల్ల వాతావరణం కాలుష్యం అవుతుంది. సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణకు సిబ్బందిని నియమించాలి.

– వేముల సైదులు, రామన్నపేట

స్థానిక సిబ్బంది దృష్టి పెట్టడం లేదు



వర్మి కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. మండల స్థాయిలో పర్యవేక్షణ లోపం కారణంగా ఎరువుల తయారీపై స్థానిక సిబ్బంది దృష్టి పెట్టడం లేదు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసినప్పటికీ సెగ్రిగేషన్ షెడ్లలో ఏర్పాటు చేయడం లేదు. చెత్తను కంపోస్టు షెడ్లలో వేయకుండా ఊరి అవతల పడేస్తున్నారు.

– పేరుపు స్వామి, మంతపురి

చెత్తను రీసైక్లింగ్ చేస్తలేరు



బాహుపేట గ్రామంలో రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు ఆరు నెలల నుంచి నిరుపయోగంగా మారింది. గతంలో సేంద్రియ ఎరువులను తయారు చేసేవారు. కొంతకాలంగా వాటి ఊసే లేదు. గ్రామంలోని చెత్తను, డంపింగ్ యార్డు వద్దకు తీసుకెళ్తున్నా రీసైక్లింగ్ చేసే ప్రక్రియ సాగడం లేదు.

– కవిడె మహేందర్, బాహుపేట

పకడ్బందీగా సమగ్ర సర్వే డేటా ఎంట్రీ

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్: సర్వేకు సంబంధించిన డేటా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు సరిపడా ఆపరేటర్లను తీసుకున్నామని, ఈ ప్రక్రియ జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో పకడ్బందీగా జరుగుతోందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న డేటా ఎంట్రీ గురించి కలెక్టర్ వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

98శాతం సర్వే పూర్తయింది

భువనగిరిటౌన్: జిల్లాలో ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే 98 శాతం పూర్తయిందని కలెక్టర్ హనుమంత రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నిర్వహణకు సంబంధించి అధికారులు మీ వద్దకు రాకున్నా, మీరు అందుబాటులో లేకపోవడం, ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో గానీ సర్వేలో నమోదు కాని ఉంటే వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇంకా మిగిలిన ఉన్న కుటుంబాలు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంప్రదించాలని పేర్కొన్నారు.

అశాస్త్రీయంగా రీజినల్ అలైన్‌మెంట్

చౌటుప్పల్ రూరల్ : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అశాస్త్రీయంగా ఉందని, దీనిని మార్చాలని చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెంలోని ఫంక్షన్ హాల్‌లో చౌటుప్పల్, గజ్వేల్, భువనగిరి ప్రాంత రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్, గజ్వేల్, భువనగిరి ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆరు నెలలుగా వేడుకుంటున్నా న్యాయం చేయడం లేదని ఆరోపించారు. భూ నిర్వాసితులను సమీకరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని అన్నారు. సమావేశంలో భూ నిర్వాసితులు సంఘం నాయకులు బండారు నర్సింహ, కేవీ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, చిన్నం బాలరాజు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని, చెస్ పోటీల్లో పాల్గొనడం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట టీటీడీ కల్యాణ మండపంలో ఓపెన్, అండర్–11, 15 విభాగాల్లో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా నుంచి ఎంతో మంది చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. అనంతరం ఓపెన్ కేటగిరీ, అండర్–11, 15 పోటీల్లో విజేతలైన బాలబాలికలకు షీల్డులతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

'కార్తీక' రద్దీ



యాదగిరిగుట్ట బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: కార్తీక మాసం.. ఆపై ఆదివారం సెలవు రోజు. దీంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీస్వామిని దర్శించుకొని, సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యే సమయానికి కొండపైన, లక్ష్మీ పుష్కరిణి చెంత బస్టాండ్‌లో, పట్టణ బస్టాండ్‌లో భక్తుల రద్దీ నెలకొంది. బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడ్డారు.

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌కు నూతన పాలకవర్గం

మోత్కూరు : మోత్కూరు వ్యవసాయ పాలక వర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాల మండలం సూనెగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నూనెముంతల విమలవెంకటేశ్వర్లును, అడ్డగూడూరు మండలం డి.రేపాక గ్రామానికి చెందిన లింగాల నర్సిరెడ్డి వైస్ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా గూడెపు కుమార్ (మరిపడిగ), పాశం వినోద (ఆత్మకూరు(ఎం)), పోచం జగన్నాథం (మోత్కూరు), బొడిగె నర్సింహ్ (మోత్కూరు), ఎం.డి.సమీర్ (మోత్కూరు), వనం బాలకృష్ణ (మోత్కూరు), బాలెంల విద్యాసాగర్ (అడ్డగూడూరు), కొంపెల్లి లలిత (పాలడుగు), పన్నాల శ్రీనివాస్‌రెడ్డి (మోత్కూరు), చిత్తలూరు సోమయ్య (చిర్రగూడూరు), వ్యాపార ప్రతినిధులుగా సోమవెంకటేశ్వర్లు, బుస్సా రవి, మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితను నియమించారు.



నూనెముంతల విమల, మార్కెట్ చైర్‌పర్సన్



లింగాల నర్సిరెడ్డి, వైస్ చైర్మన్

ప్రజావాణి పునఃప్రారంభం

భువనగిరిటౌన్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి పునః ప్రారంభిస్తున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. రెండు వారాల నుంచి కుటుంబ సర్వే, గ్రూప్– 3 పరీక్షల నేపథ్యంలో ప్రజావాణి వాయిదా వేశారు. దీంతో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వీలు లేకుండా పోయింది. ప్రజావాణి పునఃప్రారంభిస్తుండడంతో అర్జీదారులు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు వచ్చే అవకాశం ఉంది.

• సదర్ సంబురం



రామన్నపేటలో ఆదివారం రాత్రి అఖిల భారత యాదవ మహాసభ మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో దున్నపోతుల విన్యాసాలు

మత్స్యకారులకు అండగా..

- మత్స్య సంపద యోజన పథకం తీసుకువచ్చిన కేంద్రం
- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భువనగిరిటౌన్: మత్స్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు మోదీ సర్కార్.. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకాన్ని తీసుకువచ్చింది. రైతులకు వ్యవసాయం కాకుండా అనేక ఉపాధి అవకాశాలను కల్పించి ఆదాయం ఉత్పాదకత పెంచడం మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడం దీని ఉద్దేశం. పీఎంఎంఎస్‌వై పథకానికి జిల్లా వ్యాప్తంగా 9,856 యూనిట్లు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 187 యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి.

ఎవరైనా ప్రయోజనం పొందవచ్చు..

మత్స్యరంగానికి సంబంధించిన ఇతర వ్యక్తులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందవచ్చు. మత్స్యకారులు, మత్స్యకార్మికులు, చేపల విక్రయదారులు, మత్స్య అభివృద్ధి కార్పొరేషన్లు, స్వయం సహాయక సంఘాలు, మత్స్యరంగం, మత్స్య సహకార సంఘాలు, మత్స్యకార సంఘాలు, ప్రైవేట్ సంస్థలు సద్వినియోగం చేసుకోవచ్చు. చేపల పెంపకానికి నాణ్యమైన విత్తనాల సేకరణ, మెరుగైన నీటి నిర్వహణ ఈ పథకం ద్వారా కల్పిస్తారు.



పోచంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు

సద్వినియోగం చేసుకోవాలి

సీఎస్‌సీ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులు ధ్రువపత్రాలు తీసుకువస్తే రిజిస్ట్రేషన్ చేస్తాం. ఆధార్ కార్డు తప్పనిసరిగా తప్పనిసరిగా ఫోన్‌నంబర్‌కు లింక్ అయి ఉండాలి. ఈ పథకాన్ని మత్స్య పరిశ్రామక రంగంలో ఉన్న వారు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి.

– బుగ్గ శ్రీధర్, సీఎస్‌సీ మేనేజర్

దరఖాస్తు చేసుకునే విధానం..

ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో సమీపంలోని సీఎస్‌సీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చు. https://dof.gov.in/ pmmsy వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు అనంతరం మత్స్యశాఖ అధికారులు విచారణ చేసి పథకానికి అర్హులైతే ఎంపిక చేస్తారు.

ఈ యూనిట్లకు అవకాశం

ఈ పథకం కింద 8 రకాల యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. మంచినీటి హెచరీలు, చేపల పెంపకానికి పాండ్స్ నిర్మాణం, రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్, జలాశయంలో చేపల పెంపకం, ఇన్సులేటెడ్ వాహనాల సరఫరా, మూడు చక్రాల వాహనాల సరఫరా, చిన్న తరహా చేపల దాణా మిల్లుల ఏర్పాటు, మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలను అందించనుంది.

క్లుప్తంగా

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మఠంపల్లి : పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆదివారం ఆడ బిడ్డకు జన్మనించింది. 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోజ్యాతండాకు చెందిన గర్భిణి అజ్మీరా రోజా పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో మహిళను వాహనంలో హుజూర్‌నగర్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా పెదవీడు వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువై 108సిబ్బంది సహాయంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇరువురిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో కాన్పు చేసిన 108సిబ్బందిని పలువురు అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడరూరల్ : ఏపీ నుంచి కోదాడకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని కోదాడ రూరల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని లింగాల వాగు నుంచి అక్రమంగా ఇసుకను లారీలో లోడ్ చేసి కోదాడకు తరలిస్తుండగా రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. నందిగామకు చెందిన డ్రైవర్ రావెళ్ల శ్రీనివాసరావుతోపాటు యాజమాని వేముల గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బావిలో మునిగి వ్యక్తి మృతి


బంటు సైదులు (ఫైల్)

వేములపల్లి : బావిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆమ నగల్లు గ్రామానికి చెందిన బంటు సైదులు(37) ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీదేవిగూడెం గ్రామశివారులోని తనపొలం వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవిగూడెం గ్రామ పరిధిలోని చలిచీమలపాలెం గ్రామానికి చెందిన చెన్నబోయిన విఠల్ తన వ్యవసాయ బావిలో మోటార్ ఇరుక్కుందని, తీసేందుకు రావాలని సైదులును తీసుకెళ్లాడు. విఠల్ ఒడ్డున ఉండగా సైదులు బావిలోకి దిగి మోటార్ తీసేందుకు వెళ్లి ఎంతకు పైకి రాలేదు. దీంతో విఠల్ స్థానికులకు సమాచారం అందించగా స్థానికులు అక్కడకు చేరుకోని పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ నరసింహారావు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో బావిలో గాలించి సైదులు మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఇప్పటి వరకు పోలీస్‌స్టేషన్‌లో ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు వెల్లడించారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం


ఒగ్గు భిక్షం (ఫైల్)

పెన్‌పహాడ్ : ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒగ్గు భిక్షం(40) అదే గ్రామానికి చెందిన దండెంపల్లి సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో స్తంభంపై విద్యుత్ తీగలు తీసేందుకు భిక్షంను కూలీ పనులకు తీసుకెళ్లాడు. విద్యుత్ తీగలను లాగుతున్న క్రమంలో స్తంభం పైన ఉన్న భిక్షం తాడు సహాయంతో విద్యుత్ తీగను అందుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐ గోపికృష్ణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం


హుజూర్‌నగర్ : చింతలపాలెంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్, అధికారులు

● రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతలపాలెం మండల కేంద్రంలో రూ.2.61కోట్లతో నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, రూ.2.98కోట్లతో ఎంపీడీఓ కార్యాలయం, రూ.2.38కోట్లతో పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం, రూ.10కోట్లతో చేపట్టనున్న మేళ్లచెరువు - చింత్రియాల రోడ్డు పనులకు, రూ.10కోట్లతో చేపట్టనున్న కిష్టాపురం నుంచి పీఆర్ సిమెంట్ వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలలో ఆయన మాట్లాడారు.


మఠంపల్లి : డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న మంత్రి

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో తన హయాంలో రోడ్లు, లిఫ్టలు మంజూరు చేయించానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని లిఫ్టలను వినియోగంలోకి తేచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. తొలుత చింతలపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి ఉత్తమ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో కలెక్టర్ తేజస్‌నందలలాల్ పవార్, అదనపు ఎస్పీ నాగేశ్వరావు, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ సీతారాం, డీఈ పవన్‌కుమార్, ఏఈ సతీష్‌కుమార్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి, ఆర్ఐ వాసుదేవరావు, నాయకులు నరాల కొండారెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, సీతారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రాకు ముఖచిత్రంగా మారనున్న మఠంపల్లి : మంత్రి

మఠంపల్లి : తెలంగాణ–ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న మఠంపల్లి మండలానికి రూ.80కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణంతో ముఖచిత్రం మారిపోనుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో రూ.80కోట్లతో చేపట్టనున్న హుజూర్‌నగర్–మట్టపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించానన్నారు. ముఖ్యంగా వేలాది ఎకరాల భూములకు సాగునీరందించేందుకు ఎత్తిపోతల పథకాలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో గొల్ల కుర్మలకు తగిన న్యాయం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


సదర్ సమ్మేళనంలో దున్నపోతు విన్యాసం

రామన్నపేట : సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో రాష్ట్రంలోని గొల్ల కుర్మలకు తగిన న్యాయం జరుగుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గొల్ల కుర్మల ఆత్మగౌరవ ప్రతీక అయిన సదర్ సమ్మేళనాన్ని అధికారిక పండుగగా గుర్తించడంతో పాటు రూ.1.50కోట్లు కేటాయించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్నిరకాల సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించి బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు, గొల్లకుర్మలకు పెద్దపీట వేయనున్నట్లు, గొల్లకుర్మల సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. పశువులను, పాడిపంటలను పూజించే సంస్కృతి కలిగిన యాదవులు నమ్మకానికి విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. మండల కేంద్రంలో యాదవ సంఘం భవన నిర్మాణానికి తక్షణమే రూ.లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ మాట్లాడారు. ఇంద్రపాలనగరం యాదవ సంఘం వారు ప్రత్యేకంగా దున్నలను ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దున్నపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాదవ మహాసభ మండల అధ్యక్షుడు తిరుగుడు మల్లికార్జున్ అధ్యక్షన జరిగిన సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే నోమల భగత్, నాయకులు దూదిమెట్ల బాలరాజు, కాసం వెంకటేశ్వర్లు, సోమనబోయిన సుధాకర్‌యాదవ్, కడారి స్వామియాదవ్, జంగిలి నర్సింహ, లొడంగి గోవర్ధన్, ముక్కాముల దుర్గయ్య, సుక్కల సత్యం, ఐలయ్య, నాగేష్, జంగయ్య, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, నర్సింహ పాల్గొన్నారు.


రామన్నపేట : సదర్ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీర్ల అయిలయ్య. పక్కన ఎమ్మెల్యే వీరేశం తదితరులు

అప్పుల బాధతో వ్యవసాయ కూలీ బలవన్మరణం

కేతేపల్లి : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపంతో ఓ వ్యవసాయ కూలీ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండంలోని తుంగతుర్తి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన ఉప్పుల మల్లయ్య(45) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మల్లయ్య తన కూతురు వివాహంతో పాటు, కుటుంబ అవసరాల కోసం గ్రామంలో తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీరేమార్గం లేకపోవడంతో మనస్థాపం చెందిన శనివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మల్లయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మల్లయ్యకు భార్య, వివాహమైన కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తే సహించేది లేదు

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హాలియా : బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. హాలియాలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నందుకు నిరసనగా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలో చేపట్టిన చలో బీసీ.. హలో హాలియా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. హాలియా పట్టణంలో కుమ్మర సోదరులు మొల్లమాంబ విగ్రహాన్ని పెడుతుంటే దురుద్దేశంతో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీ నేతల విగ్రహాలను జేసీబీలతో తొలగిస్తే బీసీలంతా ఐక్యంగా రాజకీయ పార్టీల నాయకుల కుర్చీలను కూల్చివేస్తామని హెచ్చరించారు. జానారెడ్డికి పదవి వ్యామోహం ఇంకా తగ్గలేదని, తన తనయులకు పదవులు వచ్చేలా చేసుకున్నారన్నారు. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైశ్య కులానికి చెందిన పార్వతమ్మను పదవి నుంచి తొలగించి నరేందర్‌రెడ్డి అనే వ్యక్తికి పదవి కట్టబెట్టారని విమర్శించారు. బీసీ కులానికి చెందిన వెంకటేశ్వర్లు యాదవ్‌ను మార్కెట్ చైర్మన్ పదవి నుంచి తొలగించి శేఖర్‌రెడ్డిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బీసీలు అధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందిన ఓసీలను రీకాల్ చేస్తామన్నారు. మొల్లమాంబ విగ్రహాన్ని అవమానపర్చిన మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉంటే కేవలం ఒక్క బీసీ, ఇద్దరు ఎస్సీ, ఒక ఎస్టీ ఎమ్మెల్యేలు ఉన్నారన్నారని, మిగిలిన ఎనిమిది మంది రెడ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చెబితే జానారెడ్డి దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. త్వరలో నాగార్జున సాగర్ నియోజకవర్గంతో పాటు నల్లగొండ ఎన్జీ కాలేజీలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, బీసీ నాయకులు, వట్టె జానయ్య, మహేష్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, సుదర్శన్, పొదిలి శ్రీనివాస్, నల్లగొండ సుధాకర్, సైదులుగౌడ్, అర్జున్, కోట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి

మోతె : మండల పరిధిలో రావిపహాడ్ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధురాలు కోట లక్ష్మమ్మ (101) ఆదివారం తెల్లవారుజామున మరణించింది. కోట లక్ష్మమ్మ కుటుంబం మొదటి నుంచి కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా వ్యవహరించేవారు. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటంలో దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారు. నాడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి సాయుధ పోరాట దళంలో రావిపహాడ్ గ్రామ కమ్యూనిస్టు ఉద్యకారులతో కలిసి లక్ష్మమ్మ పనిచేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. కోట లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు (కోట పాపిరెడ్డి, కోట గోపాల్‌రెడ్డి, కొప్పుల సూర్యమ్మ, నందిగామ సుజాత) ఉన్నారు. రావిపహడ్ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు కోట లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోడపంగి యలమంచి, కాకి సురేందర్‌రెడ్డి, కోడి గంగయ్య, కోట పాపిరెడ్డి, కోట గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, కోట మధుసూదన్‌రెడ్డి, శ్యామలేటి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

పార్కింగ్‌లో వాహనాలు ఫుల్


యాదగిరికొండకు దిగువన ఉన్న సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు అధికంగా కార్లు, ద్విచక్ర వాహనాలపై రావడంతో కొండ కింద, కొండ పైన పార్కింగ్ ప్రాంతాలు నిండుగా కనిపించాయి. రింగ్ రోడ్డు, వైకుంఠద్వారం, తులసీ కాటేజీ, పాత గోశాల ప్రాంతాల్లో వాహనాలు నిండిపోయాయి. యాదగిరికొండపైకి రూ.500 చెల్లించి భారీగానే భక్తులు తమ వాహనాల్లో వెళ్లారు. కొండ కింద సెంట్రల్ పార్కింగ్ ప్రాంతం, వ్రత మండపం, హెలిప్యాడ్ స్థలాల్లో వాహనాలను భారీ సంఖ్యలో నిలిపారు.

నీటి కుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

మునుగోడు: ఇసుక వాగులోని నీటి కుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మునుగోడు పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. చొల్లేడు గ్రామానికి చెందిన దోటి సత్తయ్య (31) అనే మతిస్థిమితం లేని వ్యక్తి తమ ఇంటి నుంచి అప్పుడప్పుడు బయటకు వెళ్లి రెండుమూడు రోజులకు తిరిగి వచ్చేవాడు. అదే తరహాలో ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్తయ్య తిరిగి రాలేదు. ఎప్పటిలాగే రెండు రోజుల తరువాత వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. కాగా సత్తయ్య మృతదేహం ఆదివారం ఆ గ్రామ వాగులోని ఓ నీటి కుంటలో కనిపించిందని గ్రామానికి చెందిన వంగూరి శంకరయ్య అనే వ్యక్తి బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సత్తయ్య మృతదేహాన్ని పరిశీలించి బయటకు తీశారు. సత్తయ్య మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ రవి తెలిపారు. సత్తయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కేతేపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంలో విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. కేతేపల్లిలో నూతనంగా నిర్మించిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి స్మారక భవనాన్ని(సీపీఎం మండల కార్యాలయం)సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే రూ.31 వేల కోట్లు ఖర్చవుతుందని, కానీ, కేవలం రూ.18 వేల కోట్లు మాఫీ చేసి మొత్తం రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటోందన్నారు. రైతు భరోసా, వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 పంపిణీ ఊసే లేకుండా పోయిందన్నారు. బీజేపీ అణగారిన వర్గాల కోసం కాకుండా.. కేవలం అదానీ,అంబానీల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ.. పదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కుట్ర పన్నుతుందని విమర్శించారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి చింతమళ్ల లూర్దుమారయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుదాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యూరాలు కందాల ప్రమీల, బొజ్జ చినవెంకులు, అశోక్‌రెడ్డి, కోట లింగయ్య, ఎల్.రాజు, శోభన్, ఎ.సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో భక్తజన సందోహం


క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నార్కట్‌పల్లి : కార్తీక మాసం సందర్భంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో లడ్డూ ప్రసాదం కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేశారు. టోల్‌గేట్ నిర్వాహకులు రుసుము తీసుకోని వాహనాలను గుట్టపైకి పంపడంతో గుట్టుపైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆలయ అధికారులు, పోలీసులు స్పందించి గుట్టపైన ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనాలను గుట్టు పైకి అనుమతించలేదు. ఈ వేడుకల్లో ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రాజ్యలక్ష్మి, వంశీ, అర్చకులు శ్రీకాంత్, సురేష్, సతీష్, నాగయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

నకిరేకల్ : ఉరివేసుకొని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన పందిరి నాగమ్మ(38) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటుంది. నాగమ్మ మానసిక, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అద్దె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు సూరారం భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఓ కుమారుడు ఉన్నాడు.

జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలి

చిట్యాల: ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ ప్రతిపాదిస్తున్న ఒకే దేశం–ఒకే ఎన్నికల(జమిలి ఎన్నికలు) విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కోరారు. చిట్యాలలో ఆదివారం జరిగిన డీవైఎఫ్ఐ నల్లగొండ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. నియంతృత్వ ధోరణితో దేశంలో ఏకీకృత రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సహజ వనరులు, రాయితీలను రద్దు చేస్తే కోట్లాది రూపాయల ప్రజాధనం మిగులుతుందన్నారు. అంతకుముందు సంఘం జెండాను ఆయన ఎగురవేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ వడ్డెగాని మహేష్, మహమ్మద్ అక్రం, జిట్ట రమేష్, కట్ట లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పంది నరేష్, అవిశెట్టి కిరణ్, కార్తీక్, సీపీఎం నాయకులు అర్రూరి శ్రీను, పరమేష్, గోపికృష్ణ, జిట్ట సురేష్, యాకూబ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ పలకరింపు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 50 సంవత్సరాల తరువాత ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 1973–75 విద్యా సంవత్సరానికి చెందిన ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు సుమారు 50 మంది కళాశాలకు చేరుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తువేసుకున్నారు. కార్యక్రమంలో ఎడ్ల కన్నయ్య, జొన్నలగడ్డ లక్ష్మారెడ్డి, డి.మోహన్, కె.హేమసుందర్‌గుప్తా, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.